# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ భారత దేశానిదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.
2. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తతో విద్యుత్తును తయారు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
3. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.
4. యూరియా సరఫరాను పెంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
5. ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన వారి పింఛన్లు తొలగించేది లేదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

==========================

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ భారత దేశానిదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. త్వరలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందన్నారు. ఢిల్లీలో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో కనిపించే వృద్ధికి స్థూల ఆర్థిక స్థిరత్వం కారణమని తెలిపారు. ద్రవ్యోల్బణం, వడ్డీలు తక్కువగా ఉన్నాయని, ఫారెక్స్ నిల్వలు అధికంగా ఉన్నాయని వెల్లడించారు. ప్రతి నెలా లక్షలాది మంది దేశీయ పెట్టుబడిదారులు మార్కెట్‌లో వేల కోట్ల రూపాయలను పెట్టుబడి పెడుతున్నారని ప్రధానమంత్రి వెల్లడించారు. మేడ్ ఇన్ ఇండియాలో భాగంగా 6జీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. భారతదేశంలో సెమీకండక్టర్ సంబంధిత కర్మాగారాలు రావడం ప్రారంభించాయని వెల్లడిస్తూ.. ఈ సంవత్సరం చివరి నాటికి మొట్టమొదటి మేడ్ ఇన్ ఇండియా చిప్ మార్కెట్‌లోకి వస్తుందని ప్రధాన మంత్రి ప్రకటించారు.

--------------------------

ఇళ్ల నుంచి సేకరించిన చెత్తతో విద్యుత్తును తయారు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇందుకోసం 330 కోట్ల రూపాయలతో వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీన్ని 18 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిన్న జరిగిన స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తూ... రాష్ట్రంలో పేదల కోసం సూపర్ సిక్స్ పథకాలను అమలు

చేస్తున్నామన్నారు. ఎన్‌టిఆర్ భరోసా, అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం, చేనేతలకు ఉచిత విద్యుత్తు వంటి పథకాల అమలును వివరించారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పి–4 ద్వారా పేదరికాన్ని రూపుమాపేందుకు చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

దేశ రాజధాని ఢిల్లీలో నేటి నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నిన్న ఢిల్లీకి చేరుకున్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసన సభల పాత్ర, శాసనసభ్యుల బాధ్యతలు, పార్లమెంటరీ ప్రమాణాల బలోపేతం వంటి పలు అంశాలపై ఈ కాన్ఫరెన్స్‌లో చర్చలు జరగనున్నాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

మరోవైపు ఈ సదస్సుకు హాజరయ్యేందుకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిన్న ఢిల్లీకి చేరుకున్నారు.

---------------------------

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా, ఏడాదికి 60 వేల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కేటాయింస్తుందంటే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారమే ముఖ్య కారణమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తాడికోండలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన డ్వాక్రా గ్రూపులు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. దేశ వ్యాప్తంగా 'లక్ పతి దిది' విప్లవాన్ని సృష్టించడంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా ఉందని పేర్కొంటూ..

.వాయిస్..25 సెకన్లు

---------------------------

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రతి వర్గానికి అండగా నిలుస్తూ సంక్షేమ పాలనకు ప్రభుత్వం సరికొత్త నిర్వచనం ఇస్తోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా వైద్య, విద్యా రంగాల్లో ప్రభుత్వం కీలక సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవల్ని చేరువ చేసిందన్నారు. అలాగే విద్యారంగంలో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. బోధనాసుపత్రుల్లో వైద్య సేవల్లో 30 సూత్రాల విధానంతో గణనీయమైన మార్పు కనిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

యూరియా సరఫరాను పెంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాదులోని సచివాలయంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి నిన్న ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 42 వేల మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని, ఈ నెలాఖనాటికి మరో 37వేల 877 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై వివరాలు తెలుసుకున్న మంత్రి.. ఈ సీజన్‌లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పనిచేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు.

---------------------------

అర్హులైన వారి పింఛన్లు తొలగించేది లేదని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఒంగోలులో నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. గతంలో నకిలీ ధృవీకరణ ప్రతాలతో ఫించన్లు పొందిన వారికే నోటీసులు ఇచ్చి తొలగించామన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే ఇబ్బంది లేకుండా పునఃపరిశీలనకు అవకాశం ఇచ్చినట్లు వెల్లడించారు. అనర్హులను గుర్తించేందుకు మాత్రమే పరిశీలన జరుగుతుందని పేర్కొంటూ..

..వాయిస్... 30 సెకన్లు

---------------------------

కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో రహదారి ప్రమాదాలు నివారించేందుకు గోశాలను ఏర్పాటు చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలసి నిన్న గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. మచిలీపట్నం నగరంలో రహదారులపై ఆవులు, గేదెలు ఉండటం వలన ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గోశాలలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అదే విధంగా స్థానిక మూడు స్తంభాల సెంటర్ వద్ద గల అన్న క్యాంటీన్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ను మంత్రి కొల్లు రవీంద్ర నిన్న ప్రారంభించారు. అన్న క్యాంటీన్లు పేదల ఆకలిని తీరుస్తున్నాయని పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

పశ్చిమ బెంగాల్, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని, రేపు మరొక అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..25 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రెండు రోజులపాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================